# 13

# నాలుగు సలహాలు

అనగనగా ఒక రాజ్యంలో నవనందుడనే రాజకుమారుడు ఉండేవాడు.

అతనికి యుక్తవయస్సు రాగానే అనాటి ఆనవాయితీ ప్రకారం దేశాటనం చేసి లోకజ్ఞానం పొంది రమ్మని తండ్రి పంపించాడు.

రాజకుమారుడు ప్రయాణమై అడవిలో వెళ్తుండగా ఒకచోట కఠోరతపస్సు చేస్తూ ఒక ముని కనిపించాడు. ఆ మునిని ఆశ్రయిస్తే సరియైన లోకజ్ఞానం లభిస్తుందన్న నమ్మకంతో ఆయనకు సకల సపర్యలు చేయసాగాడు.

కొన్నాళ్ళకి ముని - రాజకుమారుని విషయం తెలుసుకుని నాలుగు సలహాలు ఇచ్చాడు.

అవి :పరాయి ప్రదేశంలో ఒంటరిగా వెళ్లకూడదని !

పరాయి వారిచ్చిన భోజనాన్ని పరీక్షించందే తినకూడదని !

పరాయి ప్రదేశంలో పడుకోవలసి వచ్చినప్పుడు శయ్యని బాగా పరీక్షించమని!

పరాయి వారితో మర్యాదగా మెలగుట ! ... అనేవి.

వాటిని విని సంతోషంతో రాజకుమారుడు తిరిగి ప్రయాణం అవుతుండగా ఒక అడవిలో విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది. ముని సలహా ప్రకారం తోడుగా ఎవర్నైనా ఉంచుకుంటే బాగుంటుందనుకున్న రాకుమారుడి కంటికి ఒక ముంగిస కనిపించింది. రాజకుమారుడు దానిని పట్టుకుని చెట్టుకు కట్టేసి ,చెట్టు క్రింద గాఢంగా నిద్రపోసాగాడు.

కొంత సేపటికి ఏదో అలికిడై లేస్తే, తనను కాటు వేయడానికి చెట్టుపైనుంచి పెద్దపాము క్రిందకి రావడం, ముంగిస దానిని ముక్కలు ముక్కలు చేయడం కనిపించింది.



ముని మాట నిజమైనందుకు సంతోషిస్తూ ముందుకు సాగిపోయాడు నవనందుడు.

ఆ తర్వాత... రాజకుమారుడు తెలియక ఒక రాక్షసరాజ్యంలో ప్రవేశించి అడవిలో ఒకచోట విశ్రమించసాగాడు.

నరవాసన పసికట్టిన రాక్షసుడు - అతనిని పట్టి తెమ్మని తన నలుగురు కుమారులను పంపాడు. వారు నయవంచన చేయదలిచి రాకుమారునికి విందుచేసి, తమ రాజధానికి రమ్మని ఆహ్వానించారు.

రాకుమారుడు ముని మాటలను జ్ఞాపకం చేసుకొని తనకి వడ్డించిన పాయసాన్ని ముందుగా పిల్లికి కొంచెం పోశాడు. విషం కలిపిన ఆ పాయసం త్రాగీత్రాగగానే పిల్లి చచ్చిపోయింది.

తమ పాచిక పారలేదని తెలిసిన రాక్షసులు- రాకుమారునికి ఒక శయ్యా ఏర్పాటు చేశారు. నేలలోని గోతిలో సలసలా కాగుతున్న నూనెను పోసి, పైన సన్నని తాళ్ళతో నేసిన మంచం వుంచి, అవి కనిపించకుండా పైన దుప్పటి పరిచి రాకుమారుని పడుకోమన్నారు. దానిమీద కూర్చోగానే వెంటనే కాగుతున్న నూనెలో పడిపోతాడన్నమాట!

ముని చెప్పిన మూడో సూక్తిని గుర్తు తెచ్చుకున్న నవనందుడు... మంచాన్ని పరీక్షించి జరిగిన మోసాన్ని తెలుసుకున్నాడు.

ఇంక లాభం లేదనుకుని వాళ్ళు - రాకుమారుని ఉన్నఫళంగా ఎత్తుకుపోయి తండ్రి ముందు నిలబెట్టారు. రాక్షస రాజు అతన్ని ఖైదు చేశాడు.

నవనందుని అందచందాలు, మృదుభాషణం చూసి ముచ్చటపడ్డ రాక్షస రాకుమారి అతన్ని అభిమానించింది. చెరసాలకు వచ్చి అతన్ని విడిపించి రెక్కలగుర్రంతో అతనితో వాళ్ళ రాజ్యానికి వెళ్ళిపోయింది. మంచి మనసుగల ఆమెను వివాహమాడి, ముని సూక్తుల వల్ల అబ్బిన లోకజ్ఞానంతో హాయిగా రాజ్యాన్ని ఏలసాగాడు నవనందుడు.

★★★

